## కథ



# నిస్పృహ

## చంద్రలత

**గాయత్రి పెళ్ళి. శుభలేఖ ఇవ్వలేదు.**

**ఆమె ఆమాత్రం అలక పూనడం సహజమే.**

**అయినా సంతోషం. ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన మార్పు రాబోతున్నది. అందరూ ఆశించేది అదే, సరిగ్గా అలాంటి మార్పునే.**

**అంతా ఛిన్నాభిన్నం అయ్యాక కూడదీసుకోవడం ఎంత కష్టమో – కూడదీసుకుని మళ్ళీ నిలదొక్కుకోవడమూ అంతే కష్టం.**

ఇదంతా జరగవలసింది కాదు. కానీ జరిగింది.

ఎవరిపాటికి వాళ్ళు నిస్సహాయంగా చూస్తూ ఉండగా –

గాయత్రిని చికాకు పెట్టేట్లు –

అహ, కాదు –

గాయత్రిని ఒక్కదానినే కాదు. ఆమెతో ముడిపడ్డ వారందరినీ.

గాయత్రి తండ్రి వయోలిన్ నేర్పేవాడు. అప్పట్లో, ఎప్పుడైనా కచేరీలు ఉండేవి. కొన్నాళ్ళకి అవీ లేవు. ఏదో బడిలో కొంతకాలం పనిచేశాడు. పుస్తకాలు బైండింగ్ చేయడం, ప్రూఫ్ రీడింగ్ లాంటి అరకొర పనులు చేస్తూ వుండేవాడు – పని దొరికినప్పుడల్లా.

ఏమైనా నిత్య జీతభత్యాలు లేని జీవితాలు, బొటాబొటి సంసారాలు. వారికి ముగ్గురు అమ్మాయిలు మైత్రేయి, గాయత్రి, వైదేహి.

మైత్రేయి డిగ్రీ పూర్తవగానే కోరల్ మైక్రోల్యాబ్స్‌లో ఉద్యోగానికి అప్లై చేసింది. కోస్తా తీరమంతా వ్యాపించిన రొయ్యల చేపల సాగుదార్లకు ఇది చాలా ముఖ్యమైన సంస్థ. దాని వ్యవస్థాపకులు

మైక్రో బయాలజిస్టులు సుమతి, ఉదయ్‌లు. ఈ దంపతులు రోగనిర్ధారణ చేయడమే కాక, నిపుణులతో ప్రత్యేక చికిత్సా కేంద్రాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ. సుమతి రోగ నిర్ధారణ విభాగాన్ని - ఉదయ్ చికిత్సా విభాగాన్ని నిర్వహిస్తున్నారు. అటు కలకత్తా నుంచి ఇటు కొచ్చిన్ వరకు ఎక్కడినుంచైనా నిపుణుల అభిప్రాయాలను నిమిషాల్లో తెప్పించగల వ్యవస్థను వారు రూపొందించారు.

చూస్తుండగానే, కోరల్ మైక్రో ల్యాబ్స్ రైతుల నోట్లో నాని - రొయ్యలాసుపత్రిగా పేరు గడించింది. ఆ దంపతులు రొయ్యల డాక్టర్లు అయిపోయారు.

ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి. ఈ రొయ్యలాసుపత్రికి ఆ ఊళ్ళో ఓ మంచి పేరుంది. విమెన్ ఫ్రెండ్లీ - అని. ఉన్న వారిలో ఏ కొద్దిమందో తప్పించి అందరూ ఉద్యోగినులే. ఆ కొద్దిమంది కూడా వివాహితులు. మర్యాదస్తులు.

ఉద్యోగ వాతావరణం మీద సుమతికి, ఉదయ్‌కి కొన్ని స్పష్టమైన ఆలోచనలు వున్నాయి. స్త్రీ పురుషుల భేదం లేకుండా ఒక మర్యాదపూర్వకమైన గౌరవప్రదమైన వాతావరణం కల్పించగలిగామని వారి భావన. ఆమేరకు తమ సిబ్బందికి బోధనా తరగతులు నిర్వహిస్తారు.

ఆ చిన్న పట్టణంలో ఈ వార్త నలుగురి నోట్లో నానుతూ ఉంటుంది. చివరికి, మర్యాదస్తులే రొయ్యలాసుపత్రిలో ఉద్యోగానికి చేరతారన్న భావన స్థిరపడిపోయింది.

మైత్రేయి అక్కడ మూడేళ్ళు అకౌంటెంట్‌గా పని చేసింది. తన జీతంలో కొంత చెల్లెళ్ళ చదువుకు, మరికొంత తన పెళ్ళికి పొదుపు చేసుకొంది.

పెళ్ళయి వెళుతూ, తన ఉద్యోగంలో చెల్లెలు గాయత్రిని చేర్పించి వెళ్ళింది.

మైత్రేయి కలివిడి స్వభావం కలది. నలుగురితో ఇట్టే కలిసిపోతుండేది. ఆమెతోపాటే ఆమె క్లాస్‌మేట్ తులసి కూడా అక్కడ చేరింది. తులసిది కొంచెం ఈర్ష్యా స్వభావం.

ఇద్దరూ ఒక్కసారేఉద్యోగంలో చేరినా, మైత్రేయి స్నేహ స్వభావం ఆమెకు మంచిపేరు తీసుకురావడం తులసి సహించేది కాదు. పైనుంచి, తులసిది రిసెప్షన్‌లో ఉద్యోగం. మైత్రేయి బ్యాంక్ వ్యవహారాల నుంచి జీతభత్యాల పంపిణీ వరకూ చూసుకొనేది. అది ఆమె ఉద్యోగం.

జీతభత్యాలు మైత్రేయి చేతుల మీదుగా ఇవ్వడం ఎందుకో తులసికి అసలు గిట్టేది కాదు. ఆ వ్యవహారాల వలన మైత్రేయితో ఇతర సిబ్బంది కొంత స్నేహం, చొరవ పెంచుకుంటూ రావడం ఆమెకు పొసిగేది కాదు.

పైకి నవ్వుతూనే, అటూ ఇటూ చాడీలు మోస్తూ కొంత హడావుడి చేస్తూ ఉండేది.

పైనుంచి, మైత్రేయి వెళుతూ గాయత్రికి ఆ పనులన్నీ అప్పజెప్పి వెళ్ళింది. తన చెల్లెలు వయసున్న గాయత్రి చేరడమే ఒక ప్రాధాన్యత ఉన్న స్థానంలో కావడం ఆమెకు అసలు మింగుడుపడలేదు.

అంతే -

అవకాశం దొరికినప్పుడల్లా ముప్పతిప్పలూ - దొరకనప్పుడు మూతివిరుపులు - ఎలాగైనా గాయత్రికి అటూఇటూ చిన్నాపెద్దా ఇబ్బందులు తప్పేవి కావు.

అందులోనూ, గాయత్రిది కలివిడి మనస్తత్వం కాదు. తనలో తను ముడుచుకుని ఉండేది. తన పనిలో తను. ఆకుకు అందకుండా పోకకు కందకుండా పని నెగ్గుకొస్తుండేది.

అంతేకాదు, గాయత్రి ఉద్యోగం చేస్తూనే ఎం.కాం. కూడా పూర్తిచేసింది. కంపెనీ ఆడిటర్ల దగ్గర ఆడిటింగ్ నేర్చుకుంది. కంప్యూటర్ పరిజ్ఞానం సంపాదించింది. చూస్తుండగానే, అందరి తలలో నాలుక అయింది. అలాగే, తులసి సూటిపోటి మాటలకు అందరూ ఆమె స్వభావంగా భావించి, అలవాటుపడిపోయారు. అంతా సవ్యంగా సాగుతుండగా - చిన్న ఇబ్బంది వచ్చిపడింది.

సుమతికి చిన్న ఆపరేషన్ చేయవలసి వచ్చింది. సుమతి, ఆమెతోపాటు ఉదయ్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వుండే సమయంలో గాయత్రి వారికి పెద్ద అండ అయింది. ఆఫీసు పనులన్నీ ఒంటి చేతి మీద చక్కదిద్దేది. ఎప్పటికప్పుడు ఫోనులో వారిద్దరితో విషయాలు చర్చించేది.

ఒక్క లెక్క తప్పేది కాదు.. ఒకపూట మానేది కాదు.

అలా వారి ఆఫీస్‌లోనే కాక ఇంట్లోను మనిషయిపోయింది.

సుమతికి ఆపరేషన్ అయిన మూడోరోజో నాలుగో రోజో - గాయత్రి ఫోన్ చేసింది - ''ఎక్కడి వాళ్ళం అక్కడ ఆగిపోయాం. మేం ఇళ్ళకు ఎలా వెళ్ళం?'' అంటూ. ఎప్పుడూ ఇంతే. ఆ వూళ్ళో ఉంటే అతివృష్టి లేకుంటే అనావృష్టి.

''పొద్దున ఆఫీసుకు బయలుదేరినప్పుడు మబ్బు తునకైనా లేదు. ఇప్పుడు కుండపోత వాన. వీధుల్లో మోకాలి లోతు నీళ్ళు. కదలలేం, మెదలలేం. ఇంట్లో అమ్మా నాన్నలు కంగారుపడతారు.''

నిజమే, తుఫాన్ హెచ్చరిక కూడా జారీ అయింది. మన్ను మిన్ను ఏకమయ్యేట్లు వాన.

సుమతి, ఉదయ్ సిబ్బందిని అందరినీ ఆఫీస్ వ్యాన్‌లో పంపే ఏర్పాట్లు చేయమన్నారు. చాలా మంది అమ్మాయిలు. అందరి ఇళ్ళ దగ్గర ఎంత కంగారుపడుతుంటారో - అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి.

నాలుగు రోజులు ఎవరో పనిగట్టుకుని నీళ్ళు గుమ్మరించినట్లు వాన.

ఐదో రోజున మళ్ళీ చూద్దామన్నా ఆకాశంలో మబ్బుతునకైనా లేదు.

సుమతిని ఆపరేషన్ అనుకున్నదానికన్నా ఎక్కువ ఇబ్బంది పెట్టింది. కోలుకోవడానికి చాలా సమయం పట్టింది.


ఆ సమయంలో గాయత్రి వారి ఇంటికే వచ్చి వ్యవహారాలు చెప్పి వెళ్ళేది. లెక్కలు అప్పజెప్పి వెళ్ళేది. ఓరోజు సుమతిని తనకు రెండు రోజులు సెలవు కావాలని అడిగింది గాయత్రి.


''ఎందుకమ్మా'' సుమతి యథాలాపంగా అడిగింది.

''తిరుపతి వెళ్ళాలి'' గాయత్రి యథాలాపంగానే సమాధానం ఇచ్చింది.

అదే ఆఖరిసారి సుమతి గాయత్రిని చూడడం. ఆవేళ ఎందుకోగాని గాయత్రిలో అంతకుమునుపు ఎన్నడూ లేని ఓ గొప్ప హుషారు కనబడుతోంది. ముఖం చిరునవ్వు పులిమినట్లుగా విప్పారి వుంది. చేతుల నిండా గోరింటాకు పెట్టుకొని ఉంది. ఆకుపచ్చని పూలగాజులు వేసుకొని వుంది. చెవులకు ముత్యాల జూకాలు. తలనిండా కనకాంబరాలు. ఆమె వేసుకున్న బంగారు పసిమి రంగు చుడీదార్ ముఖం ప్రతిఫలిస్తోందా అన్నట్లు - ముఖం కాంతిగా వింతశోభతో కళకళలాడుతూ వుంది.

అసలే ముత్యాలసరాల తీరుగా మాట్లాడే గాయత్రి - ఆ రెండు మాటలు మాట్లాడేసి వెళ్ళిపోయింది.






ఇక ఆఖరుసారిగా కులాసాగా కలవడం – అదే.

***

''తొంద... తొందరగా... డాక్టరు గారిని... పిల వండమ్మా... ఫోను.. ఇవ్వమ్మా'' ఆ మరునాడు ఉదయం ఎనిమిది గంటలప్పుడు డాక్టర్ల ఇంటికి సెక్యూరిటీ ఫోను.

అతని గొంతులో వణుకు. మాటలో తొట్రు పాటు.

ఫోన్ అందుకున్న సుమతి ఆశ్చర్యపోతూ అంది – ''వాకింగ్‌కి వెళ్ళి ఇంకా రాలేదు. పోనీ, సెల్‌కు ఫోన్ చెయ్యరాదా, సుబ్బయ్యా?''

సుమతి మాట పూర్తన్నా కాకముందే అతను ఫోన్ పెట్టేశాడు.

సుమతికి అతని ప్రవర్తన అసహజంగా అనిపిం చింది. ఆఫీస్‌కి తయారయ్యే హడావుడిలో ఆ విషయం మరుగునపడిపోయింది. నిన్న ఇంక్యుబే షన్‌లో పెట్టిన శ్యాంపిల్స్ రీడింగ్స్ తీసుకోవాలి.

ఎంతకీ ఉదయ్ రాకపోవడంతో, అతని సెల్‌కి ఫోన్ చేసింది.

''ఇదుగో వచ్చేస్తున్నాను. ఇప్పటికి అయింది'' అవతల ఉదయ్ నిట్టూర్పు వదిలాడు.

''ఏం అయ్యింది?'' సుమతి ప్రశ్న గాలిలో కలిసి పోయింది.

అప్పటికే ఫోన్ డిస్‌కనెక్ట్ అయింది. సుమతిలో ఏదో అనుమానం కదలాడింది. విషయం ఏమిటో తట్టక అసహనంతో అటూఇటూ తిరిగింది. ఉద య్‌కి మళ్ళీ ఫోన్ చేయబోయింది. అంతలోనే విర మించుకుంది. ఏదో తెలియని ఆందోళనతో ఉదయ్ కోసం ఎదురుచూడసాగింది.

రావడంతోనే ఒక దిగ్భ్రాంతికరమైన వార్తతో వచ్చాడు ఉదయ్.

''సుమతీ... ఏమయిందో తెలుసా నీకు? మొత్తం నలభైమంది! కత్తులు కటార్లు, దుడ్డు కర్రలు, సైకిల్ చైన్లు – అబ్బ! గాయత్రి కావాలంట – పోనీ, ఆమె ఇల్లు అయినా చూపెట్టమన్నారు.''

''గా...య...త్రి..?!'' సుమతి అయోమయంగా అంది. ''కత్తులు కటార్లు ఏంటి? గాయత్రి ఏంటి? నాకేమీ అర్థం కావట్లేదు.''

''అవును, నాకు అర్థం కాలేదు – చాలాసేపటివ రకు. అసలు ఎవరూ శాంతంగా మాట్లాడేవారు లేరు. ఆవేశం. అరుపులు, కేకలు. పొడిచేస్తాం, నరి కేస్తాం – అంటూ. ముక్కలు ముక్కలుగా విషయం అర్థం చేసుకుని – వారిని సావధానపరిచేసరికి – ఈ టైం అయింది'' ఉదయ్ ఊపిరి పీల్చుకోవడానికి అన్నట్లు ఓ క్షణం తెరిపిచ్చాడు.

''ఇంతకీ, గాయత్రి ఎందుకు సెలవు పెట్టింది?''

''తిరుపతి వెళ్ళాలంది.''

''ఎవరితో?''

''ఏమో – అడగలేదు. అయినా, ఎవరితో వెళు తుంది? వాళ్ళ అమ్మానాన్నలతోనో, అక్కా బావల తోనో...''

''కాదు. షబ్బీర్‌తో''

''ష...బ్బీ...ర్...?!'' సుమతిలోని ఆశ్చర్యం ఒక్కో అక్షరంలో అలుక్కుపోయింది.

''ఊ– అతనితోనే వెళ్ళిందని వాళ్ళంటున్నారు''

''ఎందుకు?''

''పెళ్ళి చేసుకోవాలని''.

''షబ్బీర్‌కి పెళ్ళయి చాలాకాలమైంది కదా'' అప్రయత్నంగా అంది సుమతి.

పెదవి బిగించి తలాడించాడు ఉదయ్ అవున న్నట్లుగా.

ఇద్దరూ మౌనంలోకి కూరుకుపోయారు. ఆలో చిస్తున్నట్లుగా వారి నొసలు ముడిపడ్డాయి.

షబ్బీర్ వారి ల్యాబ్ టెక్నీషియన్. అతను ఉద్యో గంలో చేరేనాటికే పెళ్ళి కుదిరింది. ఉద్యోగంలో చేరిన మూడు నాలుగు నెల్లకే పెళ్ళి. అందరూ వెళ్ళి వచ్చారు.

అతని భార్య సైరా అతని బంధువుల అమ్మాయే. పదో తరగతి వరకూ చదివింది. ఆమె పరీక్షలు అయ్యీ అవగానే వారి పెళ్ళి. సైరాలో ఇంకా పసితనం పోలేదు.

షబ్బీర్‌కి అప్పటికే పాతికేళ్ళ వయసుంటుంది. కొద్దిగా వంగినట్లుగా ఉంటాడు. జుట్టు పలుచపడి పోయింది. కళ్ళద్దాలు. అప్పుడే నడివయసు వాడిలా ఉండేవాడు.

షబ్బీర్ ఎప్పుడూ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. వచ్చాడంటే – తలవంచు కుని తిన్నగా తన ల్యాబ్‌లోకి వెళ్ళిపోయేవాడు. మళ్ళీ తిరిగి వెళ్ళేటప్పుడే – అతనిని ఎవరైనా చూసేది. తల వంచుకొని ఎవరితోనూ మాట్లాడ కుండా వెళ్ళిపోయేవాడు.

ఎవరితోనూ కబుర్లు కాలక్షేపాలు చేసేవాడు కాదు. అంతేకాదు ఎలాంటి స్నేహపూర్వకమైన ఆహ్వానం అతని ముఖాన కనబడేది కాదు. అందరూ అతనిని మర్యాదస్తుడని భావిస్తూ ఉండే వారు.

''నమ్మలేకపోతున్నాను'' సుమతి గొణిగిన ట్లుగా అంది.

''నిజమే, నలుగురు కలిసి ఒక దగ్గర పనిచేస్తు న్నప్పుడు ఇలాంటివి వింటూ వుంటాం – కానీ'' ఉదయ్ నెమ్మదిగా అన్నాడు. ''ఎవరమైనా ఏం చెప్పగలం? ఇప్పుడే మనం ఎలాంటి నిర్ధారణకు రాలేం.''

సుమతి ఔనన్నట్లు తలాడించింది.

అంతలోనే ఫోన్ మోగింది.

తులసి.

''డాక్టర్, మీకు తెలిసిందా? గాయత్రి, షబ్బీర్‌ల పెళ్ళి అయిపోయింది. తిరుపతిలో!''

''.... ....'' సుమతి ఆమె మాటలు వింటూ ఉదయ్ ముఖంలోకి చూస్తోంది.

''డాక్టర్. ఇవన్నీ మామూలే. అయినా మీకు చెప్పాలి కదా అని చెప్తున్నా'' తులసి ఆగి మళ్ళీ అంది ''అయినా – నిప్పు లేనిదే పొగ రాదు.''

''మంచిది'' ముక్తసరిగా సుమతి ఫోన్ పెట్టే సింది.

ఉదయ్ సుమతి వంక సాలోచనగా చూస్తూ తలాడించాడు.

మళ్ళీ ఫోను. ఈసారి సెక్యూరిటీ నుంచి.

ఉదయం వచ్చిన వాళ్ళు మళ్ళీ వచ్చారని. ఆ వెనుకే మరో పాతికమంది కొత్తవాళ్ళు వచ్చారని.

సుమతి, ఉదయ్‌లు ముఖాముఖాలు చూసుకు న్నారు. ఒక్క ఉదుటున ఆఫీసుకు బయలుదేరింది.

వారిద్దరూ వెళ్ళేసరికి –

అటూ ఇటు వైరి బలగాలు మోహరించినట్లు – రెండు పక్షాలవారు.

నిశ్శబ్దంగా నిలబడి ఉన్నారు.

ఒకరిని ఒకరు చూస్తూ.

మాటల్లేవు. చేతల్లేవు.

తెచ్చిన కత్తులు కటార్లు కట్టెలు చెయిన్లు – వాళ్ళ తోపాటే మౌనంగా ఉన్నాయి. సుమతి, ఉదయ్ వారి మధ్యలో నుంచి నడిచి లోపలికి వెళ్ళారు. ఏమీ మాట్లాడకుండానే.

ఆ వెనుకనే వారూ అనుసరించారు.

ఏదో కవాతు జరుగుతున్నట్లుగా – క్రమశిక్షణతో – నిశ్శబ్దంగా.

అటునుంచి ఒకరు, ఇటు నుంచి ఒకరు.

ఉదయ్, సుమతి ఆఫీసులోకి వెళ్ళి, అలా కూర్చునేలోగానే – ఉదయ్ ఫోన్ మోగింది. ఉదయ్ స్పీకర్ ఆన్ చేశాడు. సుమతి నోట మాట లేనట్టు చెవులప్పగించింది.

''ఇప్పటికి రెండు మతవాద పార్టీలు కలుగజేసుకున్నాయి. వాళ్ళ మనుషుల్ని చూశారు కదా, మాది లౌకిక పార్టీ. మా పనుషులం ఎవరం రావాలా అని ఆలోచిస్తున్నాం. అందరూ అక్కడికి చేరే లోపల – మీరే ఏదో సెటిల్‌మెంట్ చేసేయండి.''

ఎలాంటి ఉపోద్ఘాతం ఊకదంపుడు లేకుండా – సూటిగా విషయంలోకి వచ్చాడు అవతలి వ్యక్తి. ఉదయ్ స్పష్టంగానే అడిగాడు.

''ఎలాంటి సెటిల్‌మెంట్?''

''ఆ ... పిల్లని సెటిల్ చేసేయండి!''

''వ్వాట్??''

''లేకపోతే మేం చేస్తాం''

''వారి వ్యక్తిగత విషయం... ఇలా...''

''వ్యక్తులతోనే సంస్థలు ఏర్పడేది. వారిద్దరూ మీ ఉద్యోగులు.''

''కావచ్చు. కానీ, ఇలాంటి వ్యక్తిగత విషయాల్లో జోక్యం ఏమేరకు చేసుకోవాలో – దానికి కొంత పరిమితులు ఉంటాయి. మాకు తెలిసిన మేరకు ఇద్దరికీ సాయం చేయాలనే చూస్తాం. అకారణంగా ఆ అమ్మాయిని 'సెటిల్' చేయమనడానికి మీరు ఎవరు?''

''అవును. మాకిది సకారణమే. ఆమెదే తప్పు. పోస్టుగ్రాడ్యుయేట్. ఉద్యోగస్తురాలు. మంచీ మర్యాద ఎరిగిన కుటుంబం నుంచి వచ్చింది. బాధ్యత లెరిగిన మనిషి. ఆమె వలనే ఈ తప్పుడు పని జరిగింది. తన పరిధిలో తానుండడం తెలియదా? ఇక్కడ చూడండి. సైరా. చిన్న అమ్మాయి. చదువూ సంధ్యా అబ్బని అమాయకురాలు. పల్లెటూరి అమ్మాయి. అతని భార్య. గుండె పగిలిపోయేట్లు ఏడుస్తోంది. చూస్తుంటే, కడుపు రగిలిపోతోంది.''

''చూడండి. గాయత్రి సెలవులో వెళ్ళింది. షబ్బీర్ చెప్పకుండానే డ్యూటీకి రాలేదు. ఆ ఇద్దరినీ కలవకుండా మాట్లాడకుండా – ఇలా తొందరపాటు ముక్తాయింపులకు రావడం సబబు కాదు'' ఉదయ్ స్పష్టంగానే అన్నాడు. ''పెళ్ళయిన మాట నిజమేనని ఎవరు నిర్ధారించగలరు?''

''మీకు చెప్పాల్సింది చెప్పాం! ఓ వందమంది మీ ల్యాబ్‌పై పడితే ఏం చేస్తారు? ఈలోగా మీ వాళ్ళని ఎక్కడి వాళ్ళనక్కడ సర్దుకోమనండి! మళ్ళీ ఊళ్ళో రొయ్యలాసుపత్రి నడపాలి కదా?''

''బెదిరిస్తున్నారా?''

''మీ ఇష్టం ఎలాగయినా అనుకోండి! మిమ్మల్ని మర్యాదగా మధ్యవర్తిత్వం చేయమన్నాం. పొద్దున అంతసేపు అడిగినా మీరు ఆ పిల్ల ఫోన్ నెంబర్ కానీ, ఇంటి అడ్రస్ కానీ ఇవ్వలేదు. మేమే అన్నీ తెలుసుకోగలం. ఆ తరువాత జరిగేదానికి మీరే బాధ్యులు'' అవతలి కంఠం గట్టిగా పలికింది.

''సైరా తండ్రి మా వ్యక్తి! అతనికి అన్యాయం జరిగితే మేం చూసి సహించం! సమూలంగా నాశనం చేస్తాం!''

''ఇది చాలా సున్నితమైన విషయం. ఇలా రోడ్డెక్కి తీర్మానాలు చేయడం మంచిదేనా? నిదానంగా ఆలోచించి చూడండి. ఇటు మీరు. అటు రెండు రకాల మతవాదుల పార్టీలు జోక్యం చేసుకున్నాయి. ఇది రాజకీయ విషయమా? అటు సైరా ఇటు గాయత్రి – ఇద్దరు యువతులకు సంబంధించిన విషయం. కట్టుబాట్ల మధ్య పెరిగిన స్త్రీలు – గబుక్కున ఎవరైనా ఏదైనా అఘాయిత్యం చేసుకుంటే? అందులోనూ, గాయత్రి – పరువూ మర్యాద గల అమ్మాయి.''

''పరువు... మర్యాద...'' అవతలి కంఠంలో వెటకారం ధ్వనించింది.

''మీరేమయినా అనండి. ఇది ఇద్దరు యువతుల జీవిత సమస్య. నాకు కొంత సమయం ఇవ్వండి. నా ప్రయత్నం నేను చేస్తాను'' ఉదయ్ గొంతులో తడి.

''అదే చేయమంటున్నాం!'' అవతలి కంఠం పొడిగా అంది. ''డాక్టర్, సాయంత్రం లోగా ఆ పిల్ల ఈ ఊరి పొలిమేరల్లో కనబడకూడదు. జాగ్రత్త! ఆపై పర్యవసానాలకు మేం బాధ్యులం కాము. మీరు అవుతారు.''

''ప్రయత్నిస్తాను!''

ఉదయ్ ఫోన్ పెట్టేయడంతోనే కుప్పకూలిపోయాడు. వాళ్ళిద్దరి కళ్ళముందు ఒద్దికగా వుండే గాయత్రి కదలాడింది. అమాయకంగా ఉండే సైరా కళ్ళముందుకొచ్చింది. ఆ దంపతుల చూపులు అప్రయత్నంగా ఆ ఫోన్ పక్కనే ఉన్న ఫోటోపై పడ్డాయి. వారి ఏకైక సంతానం. శృతి. చిరునవ్వుతో విప్పారిన కళ్ళతో వారి వంకే చూస్తోంది.

ఆలోచనల్లో పడిపోతూ – వాళ్ళిద్దరూ ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకొన్నారు.

పరిస్థితి అనుకున్న దానికన్నా తీవ్రమై కూర్చుంది. గాయత్రి మెడచుట్టూ బిగుసుకుపోవడం తెలుస్తూనే వుంది. అటు సైరా ముక్కులు కారడమూ తెలుస్తోంది. ప్చ్!

ఇంతలో సెక్యూరిటీ నుంచి ఫోన్.

అక్కడ చేరిన వాళ్ళంతా ఎక్కడివారక్కడికి వెళ్ళారని.

సిబ్బంది ఒక్కరొక్కరు రావడం మొదలుపెట్టారు. ఆఫీసు పనులు ఎప్పటిలాగానే ప్రారంభమవుతున్నాయి – మెల్లిమెల్లిగా యథాప్రకారంగా.

మళ్ళీ సెక్యూరిటీ నుంచి ఫోన్.

ఇప్పుడే గాయత్రి ఆఫీసులోకి వచ్చిందని.

సుమతి, ఉదయ్ ఒకరి వంక ఒకరు ప్రశ్నార్థకంగా చూశారు.

అటు వాళ్ళు వెళ్ళడం – ఇటు ఈమె రావడం.

ఎవరో రచించిన నాటకంలో పాత్రల ప్రవేశ విశ్రమాల్లా!

వాళ్ళిద్దరికీ ఏటు పాలుపోక ఆలోచిస్తూ కూర్చున్నారు.

ఇంతలో, గాయత్రి ఇంటర్‌కం రిక్వెస్టు –

మాట్లాడాలని, లోపలికి వస్తానని.

రమ్మన్నారు.

వచ్చింది.

ఎంత చెప్పినా కూర్చోలేదు.


నిల్చునే వుంది.


ఎంతో సహజంగా ఏదో యథాలాపంగా మాట్లాడుతున్నట్లుగా – మాట్లాడాలని ప్రయత్నించారు. ఎప్పటిలాగే. కానీ, వారిద్దరికీ గొంతు పెగల్లేదు.

కొద్దిసేపటికి సుమతి తేరుకొని మెల్లిగా అంది.

''ఏమ్మా... ఎప్పుడొచ్చావ్... తిరుపతి నుంచి?''

సుమతి కళ్ళు అప్రయత్నంగానే గాయత్రిని పరిశీలించాయి. ఎలాంటి వివాహ సంబంధ చిహ్నాలు లేవు. ఉదయ్ వంక చూసింది. ఉదయ్ పెదవి





బిగించి, తలవాల్చి, గంభీరంగా కూర్చున్నాడు.

గాయత్రి ఎప్పటిలా లేదు. కోపంలో ఉంది. వత్తిడి ముఖంలో కనబడుతోంది.

''అసలేం జరిగిందమ్మా?'' ఉదయ్ తేటగానే అడిగాడు.

''ఏమీ జరగలేదు!''

''మరి వాళ్ళంతా ఎందుకు వచ్చారు? మూడు పార్టీల మనుషులు? మూకుమ్మడిగా?''

''నాకేం తెలుసు?'' ఎన్నడూ లేని విధంగా గాయత్రి కంఠంలో పెడసరం ధ్వనించింది.

''నువ్వు చిన్నపిల్లవు కావు'' ఉదయ్ సహనంతో నెమ్మదిగా అన్నాడు.

''తెలుసు డాక్టర్''

''మరి?''

''నేను ఏం తప్పు చేశానని భయపడాలి?''

''చేశావని వాళ్ళు అంటున్నారు.''

''కొలీగ్స్‌తో కాస్త నవ్వుతూ మాట్లాడడమూ – స్నేహం చేయడమూ ఇవన్నీ తప్పులేనా? మరి, మీరు స్టాఫ్ మీటింగ్స్‌లో ఏం చెపుతారు? మన మంతా ఓ కుటుంబం – అందరం కలిసిమెలిసి ఉండాలి – అదీ... ఇదీ... అనేగా?''

''కలసిమెలసి ఉండడం అంటే – ఇలాగా?'' ఉదయ్ కంఠం గట్టిగా పలికింది.

గాయత్రితోపాటు సుమతి కూడా ఉలిక్కిపడింది.

''మీరు... మీరు... వాళ్ళ మాటలు నమ్ముతున్నారా?'' గాయత్రి గొంతులో అపనమ్మకం.

''ఈమధ్య తుఫాను వచ్చినప్పుడు. ఆమెతోపాటు సుమతి.

''సైరా బట్టలు వేసుకున్నావా – లేదా? తిరిగి వెళ్ళేటప్పుడు – నీ బట్టలు తిరగవేసుకున్నావా లేదా? మీరు వెళ్ళగానే సైరా షబ్బీర్‌తో గొడవ పెట్టుకుని పుట్టింటికి వెళ్ళిపోయిందా – లేదా? ఇవన్నీ తెలిసినా తెలియనట్లుగానే – మీరిద్దరూ కలిసి తిరుపతికి వెళ్ళారా లేదా? వెళుతూ వెళుతూ సైరాతో పెళ్ళి చేసుకుంటున్నాం – అని చెప్పారా లేదా?''

గాయత్రి నోట మాటాపలుకు లేనట్లుగా నిలబడిపోయింది.

''షబ్బీర్ వాళ్ళ ఇల్లు బంగ్లా తోటలో. మీ ఇల్లు పాదలకూరు రోడ్డు చివరలో. అది తూర్పు – ఇది పడమర. అసలు మీరు వాళ్ళింటికి వెళ్ళవలసిన అవసరం ఏం వచ్చింది?''

గాయత్రి కొయ్యబారి నిలబడిపోయింది – ఏ భావం లేకుండా.

సుమతి నివ్వెరపాటును దాచుకుందామన్నా దాచుకోలేకపోతోంది. అపనమ్మకంతో ఆమె ఉదయ్‌ను గాయత్రిని మార్చిమార్చి చూస్తోంది.

ఏం మాట్లాడాలి? అంత వివరంగా అన్నీ చెపుతూంటే!

అదే మాట ఉదయ్ అన్నాడు –

''చెప్పమ్మా గాయత్రీ – నేను ఏం మాట్లాడాలి? వచ్చిన వాళ్ళు ఇంత వివరంగా చెపుతుంటే? ఆరోజు నువ్వు వేసుకున్న చుడీదార్ రంగులతో సహా చెపుతున్నారు. గులాబీ రంగు డ్రస్సు. వంగ పూవు రంగు దుపట్టా. సైరా పూర్తిగా కుప్పకూలిపోయింది. షబ్బీర్ ఎక్కడా కనబడడం లేదు. ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటావ్?'' ఉదయ్ గొంతు మెత్తపడింది.

గాయత్రి తల వాల్చేసింది. గిరుక్కున వెనక్కి తిరిగింది. గబగబ గది బయటకు వెళ్ళిపోయింది – పెదవులు బిగించి, పిడికిళ్ళు ముడిచి.

ఉదయ్, సుమతిల పైన ఒక నిశ్శబ్ద తరంగం విరుచుకుపడింది – ముక్కలు ముక్కలుగా. కరుకుగా, గరుకుగా.

***

ఎటూ తేలని సందిగ్ధంలో పడడం ఉదయ్, సుమతిల వంతయింది.

''జాగ్రత్త!'' అంటూ జారీ అయిన ఆ టెలిఫోన్ హెచ్చరిక – ఒక్కసారిగా ఆ ఇద్దరి వెన్ను చరిచింది. ముందుగా సుమతి తేరుకుంది.

''సరే, ఇదంతా ఏమైనా కానీ, మనం గాయత్రి వాళ్ళ అమ్మానాన్నలకు తెలియజెప్పాలి. వాళ్ళకు ఇంత వ్యవహారం జరిగినట్లు తెలుసో లేదో–''

''ఆ ఫోన్ చేసే బాధ్యత సుమతి పైన పడింది.

గాయత్రి తల్లి మాట్లాడింది.

సుమతి మెల్లిగానే చెప్పింది – ''ఇందులో తప్పొప్పుల విషయం కాదు కానీ, మూడు పార్టీల మనుషులు ఆఫీసు ముందు బైఠాయించారు. గాయత్రికి ఏం హాని చేస్తారో – విషయం చక్క దిద్దే వరకు – మీరు ఓ వారంపాటు గాయత్రిని కనిపెట్టుకోండి. ఆ తరువాత తన డ్యూటీకి తను మామూలుగానే రావచ్చును.''

''మీరు మా అమ్మాయిని తప్పు పడుతున్నారా?''

''ఎవరి బిడ్డయినా ఒక్కటేనమ్మా – ఇదంతా – ఏదో వింతగా ఉంది. మాకేమీ మింగుడు పడడం లేదు. ఏదైనా వాస్తవం ఏమంటే– వాళ్ళు చాలా ఉద్రేకంతో ఉన్నారు. గాయత్రికి ఏదైనా జరగరానిది జరుగుతుందేమోనని.''

''అంటే ... మీరు... కూడా...''

''మాకూ కొంత సమయం కావాలి. మీ సహకారం కావాలి. నిజానికి, ఇది మీ వ్యక్తిగత విషయం. అలాగని, చేతులు దులుపుకోవడం ధర్మం కాదు. మేము కూడా దీనితో ముడిపడి వున్నాం. వ్యవహారం చాలా సున్నితంగా పరిణమించింది. ఒక్కోసారి సమయమే సమస్యలను పరిష్కరిస్తుంది.''

గాయత్రి తల్లి కొంత సావధానపడింది.

అవతలి వ్యక్తి గాయపడ్డట్లు విలవిలలాడడం తెలుస్తూనే ఉంది. పరిస్థితులు అందరి చేతులు దాటిపోయాయి. ఎవరూ ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి. అర్థం అవుతూనే వుంది. ఎవరో ఒకరు ఒక మార్గాంతరం అన్వేషించాలి. సుమతి మెల్లిగా అడిగింది.

''గాయత్రి తిరుపతి నుంచి ఎప్పుడు వచ్చిందమ్మా''

''ఇవ్వాళ ఉదయం. ఆమె ఒక్కటే వెళ్ళింది.

## ఎంత హాయి...

*ఉష్ణతాపం ఎవరికైనా ఒకటే. సియోల్‌లోని ఓ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో సింహం ఎంత హాయిగా సేదతీరుతుందో చూడండి. తన సహజమైన గంభీరత్వాన్ని మరిచి ఆనందాన్ని అనుభవిస్తోంది. ఎంత క్రూర మృగమైనా ఆనందం ఎవరికైనా ఒకటే కదా! ఇలాంటి వాతావరణంలో మానవులయితే 'జలకాలాటలలో ఏమి హాయిలే...' అంటూ తనివితీరా పాడుకుంటాం. ఈ సింహరాజు మదిలో కూడా ఇలాంటి పాటలాంటి ఆలోచన ఉండే ఉంటుంది. జంతు భాష మనకు తెలియదు కదా!*

కానీ, మైత్రేయి, ఆమె కుటుంబం, వైదేహి అటు మదనపల్లి నుంచి వచ్చారు. నిన్ననే దర్శనం, కల్యాణం అన్నీ చూసుకొని, వైదేహితోపాటు ఇంటికి వచ్చింది. మీకూ ప్రసాదం తెచ్చింది'' ఆమె గొంతు బొంగురుపోయింది.

''మరి షబ్బీర్, ఆమె ఇద్దరూ కలిసి ఒకే బస్సులో వెళ్ళారట. బస్సు నెంబర్ కూడా చెపుతున్నారు వీళ్ళు.''

''అతనే రానూపోనూ బస్సు టికెట్లు తెచ్చిపెట్టాడు. మేం బస్సు ఎక్కించడానికి వెళ్ళినప్పుడు అక్కడ కనిపించాడు. నాయుడుపేటో కాళహస్తో వెళుతున్నానన్నారు. అంతే – ''

''అతను మీకు బాగా పరిచయం ఉన్నట్లే''

''అవును. మైత్రేయి పెళ్ళికి వచ్చాడు, సైరాతో బాటు. ఒకటి రెండుసార్లు ఇంటికి తీసుకొచ్చాడు ఆమెను. ఎప్పుడైనా బజార్లోనో సినిమా హాల్లోనో కనిపించి పలకరిస్తూనే ఉంటారు.

''మరి, గాయత్రి ఎప్పుడైనా వెళ్ళిందా?'' సుమతి చాలా యధాలాపంగా అడిగినట్లు అడిగింది.

''ఈమధ్యనే తుఫాను అదీ వచ్చినప్పుడు, ఓ పూట వాళ్ళింట్లో ఉండాల్సి వచ్చింది గాయత్రి. భాగ్య వాళ్ళను వదలడానికి ముందు బంగ్లాతోట వైపు వెళ్ళారట. అండర్ బ్రిడ్జిలో నీరు నిండి వెనక్కి మళ్ళాల్సి వచ్చిందట. సైరా వాళ్ళింట్లో ఉండమని బలవంతం పెట్టిందట. చాలా మంచిపిల్ల. ఆమె బట్టలు అవీ ఇచ్చి – తడిసిన బట్టలు ఆరేసి, మళ్ళీ ఇస్త్రీ కూడా చేసి ఇచ్చింది.''

''అక్కడే వచ్చింది చిక్కంతా'' సుమతి గొణిగినట్లుగా అంది.

విషయం అర్థమైపోయింది. గాయత్రికి ఏం సంబంధం లేదు. కానీ, షబ్బీర్ ఏడి? ఎటూ కనబడడే?

''షబ్బీర్ విషయం–?''

''తెలియదు''

''మీకు ఒకటి చెప్పాలి''

''చెప్పండి''

గాయత్రి తిరుపతి వెళ్ళినప్పటి నుంచీ ఎవరెవరో ఫోన్లు చేయడం – బూతులు తిట్టడం – బెదిరించడం – అన్నీ అయిపోయాయి. ఇవ్వాళ మనుషులే వచ్చారంటున్నారు.''

''ఎందుకైనా మంచిది. పోలీసులకు ఫోన్ చేద్దామా?''

''పోయిన పరువు చాలదా? ఇక గాయత్రి ఏ ముఖం పెట్టుకుని బతకాలి?'' వాళ్ళమ్మ ఫోన్ పెట్టేసింది.

సుమతి, ఉదయ్ గంభీరంగా కూర్చుండిపోయారు.

ఉదయ్ తన స్నేహితుడైన ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడాడు. మఫ్టీలో సెక్యూరిటీ అందజేస్తానన్నాడు అతను, అటు గాయత్రిని ఇంటికి చేర్చేవరకు. ఆ తరువాత ఆమె ఇంటిలో ఉన్నంత వరకు.

షబ్బీర్ ఎటు పోయాడు – అన్న ప్రశ్న ఎంతకీ తేలలేదు, ఎవరికీ.

***

బయటకు వెళ్ళిన గాయత్రి, తిన్నగా ఆఫీసు ఫోన్లలో మాట్లాడిన వారి వివరాలు తీసింది. ఆఫీసు నుంచి గత రెండు రోజుల్లో వెళ్ళిన నెంబర్లలో ఎవరివి ఏమిటో నోట్ చేసింది.

''ముందు వీటిని ఇక్కడినుంచి చేసినవారెవరో తెలుసుకోండి'' అంటూ ఓ నోట్ పెట్టి – సుమతి, ఉదయ్‌ల టేబుల్‌పై పెట్టి వెళ్ళింది.

ఎవరో పిలిచినట్టుగా స్టాఫ్ అంతా సుమతి – ఉదయ్‌ల ముందు వచ్చి నిలబడ్డారు, ఒకరి తరువాత ఒకరు – గంభీరంగా. ముఖాలు వేలాడేసుకుని. చూపులు పాతేసుకుని.

వారి వెనకగా నిల్చున్న గాయత్రి ఒక్కసారిగా బద్దలయింది – ఇక తట్టుకోలేను సుమా అన్నట్లు.

''అవును. నేను వెళ్ళాను. నేను ఒక్కదాన్నే కాదు – నాతోపాటు లత, వాణి, భాగ్య – ముగ్గురం షబ్బీర్ ఇంటికి వెళ్ళాం. వానలో వ్యాన్ ముందుకెళ్ళకపోతే షబ్బీర్ ఇంటికి పిలిచారు – సైరా షబ్బీర్ ఇద్దరూ. భాగ్య ఇంటిలో మగ్గాలు వేసే గుంటలతో పూర్తిగా మునిగిపోయింది. అండర్ బ్రిడ్జి కింద నీళ్ళు. అదంతా మరో ప్రపంచం అయిపోయింది. ఫోన్ చేసి ఇళ్ళకి చెబుదామని సైరా ఇంట్లోకి వెళ్ళాం. అలా అక్కడ ఇరుక్కుపోయాం. సైరా ఎంతో స్నేహంతో మాకు అన్ని ఏర్పాట్లు చేసింది. మా తడిసిన బట్టలు మార్చుకోవడానికి తన బట్టలు తీసి ఇచ్చింది. మర్నాడు ఉదయం వాన తెరిపి ఇవ్వగానే ఎక్కడి వాళ్ళం అక్కడ దిగబెట్టాడు డ్రైవర్. అతనూ మాతోనే ఉన్నాడు'' గాయత్రి అందరి వంకా చూస్తూ బిగ్గరగా అంది. ''కానీ... అంత స్నేహంగా ఉన్న సైరా ఎందుకు అపార్థం చేసుకుందో – ఎందుకు అనుమానం పెంచుకుందో'' గాయత్రి మాటలు ఎంత వేగంగా సాగాయో అంత హఠాత్తుగా ఆగాయి.

ఆలోచిస్తున్నట్లుగా ఆమె చూపులు గాలిలో చిక్కుకుపోయాయి.

అంతా నిశ్శబ్దం. తెరలు తెరలుగా...

''నిజమే, సైరా చాలా బాధపడింది. ఆమె గుండె పగిలిపోయి వుంటుంది. ఏ భార్య అయినా అంతే కదా. సహజంగానే ప్రతిస్పందించింది. ఆమె అమ్మానాన్నలు అంతే. కానీ.. కానీ...'' గాయత్రి ఆలోచనలతోపాటుగా మాటలు సాగుతున్నట్లున్నాయి, ''సైరా అపార్థం చేసుకుని ఉండొచ్చు. భార్యకు కలిగే చిన్నచిన్న అపోహలు, అనుమానాలు – సహజమే కానీ, వాటిని ఆమె పెంచి పెద్ద చేసుకొని ఉండొచ్చు. తలా ఒక మాట దానికి జత చేసి ఉండొచ్చు. కానీ... కానీ.. ఆ అనర్థానికి మూలం మాత్రం కేవలం ఆమేనా?''

గాయత్రి అందరి ముఖాల్లోకి పరిశీలనగా చూసింది.

''అవును – అంతా ఇక్కడే జరిగింది. మనలోని వారే ఎవరో ఒకరు అటూఇటూ ఫోన్లు చేసి సృష్టించిన ప్రకంపనం –''

## మేరా భారత్ మహాన్

స్వాతంత్ర్య వేడుకలకి నిండైన శోభని చేకూర్చేందుకు 'ఖాదీ గ్రామోద్యోగ్' వారు ఓ వినూత్నమైన ఆలోచన చేశారు. మన జాతీయ పతాకాన్ని భారీస్థాయిలో రూపొందించారు. ఈ జాతీయ పతాకం పొడవు 21 అడుగులు కాగా, వెడల్పు 14 అడుగులు. మన జాతీయ స్ఫూర్తికి ఇంతకన్నా వేరే నిలువెత్తు నిదర్శనం కావాలా!






గాయత్రి ఖరాఖండిగా అంది. ఆమె ముఖం నిప్పులు చెరుగుతోంది. అంతటి ఉగ్రరూపం చూసి అందరూ జంకినట్టు నిలబడిపోయారు. ఎంతటివారైనా నిజం దాచలేరు. అంతటి శక్తి ఉందామె మాటల్లో చూపులో.

''సైరా పెద్దగా చదువుకపోవడమూ, నాకన్నా చిన్నది కావడమూ – వీటివలన ఆమెది అమాయకత్వమా? నేను చదువుకున్నదానినీ ఉద్యోగం చేస్తున్నదానిని కావడమూ – వీటివలన నాది కులటతత్వమా? మా ఇద్దరి గుండెల్ని తూట్లు పొడిచి – ఇద్దరి మనసుల్ని ఛిద్రం చేసి – మానాభిమానాలను తూకం వేయడానికి – ఎవరండీ ఆ వీధికెక్కిన పెద్ద మనుషులు? ఈ గదిలో నిలబడ్డ మహాత్ములు?''

గాయత్రి ఊపిరి పీల్చుకోవడం కూడా మరిచి పోయినట్లుగా ఉంది. ఒక్కో మాట ఆమె గాయపడ్డ హృదయంలోంచి వస్తున్నాయి. నిజమే, ఎవరూ ఆమెకి సమాధానం చెప్పే స్థితిలో లేరు. ఎవరికి వారు కళ్ళప్పగించారు.

''కలిసి పనిచేస్తున్నప్పుడు కలివిడిగా ఉండడమేనా నేను చేసిన తప్పు?'' గాయత్రి గొంతు గింగురుమనింది. ''నేను ఉద్యోగం చేస్తున్నాను. మర్యాదగా బతుకుతున్నాను. గౌరవంగా బతకాలనుకుంటున్నాను. ఏదో తప్పు చేయడానికే నేను ఇక్కడకు రావడం లేదు. అయినా, ఏది తప్పు? ఏది ఒప్పు? ఎవరండీ నిర్ణయించేది?''

గాయత్రి కోపంలోనే ఆమె నిజాయితీ కనబడుతోంది.

గాయత్రి ఆగ్రహంలోనే ఆమె ఆక్రోశం వినబడుతోంది.

''ఇవాళ నాకు జరిగింది. రేపు... మీకు జరగదా?'' ఆమె గుండెలవిసేలా ఆక్రందించింది. కుప్పకూలిపోయే లోపలే, అప్పుడే అక్కడికి వచ్చిన ఆమె అమ్మా నాన్నలు ఆమెను పొదివి పట్టుకున్నారు. ఆమె వెళ్ళిపోయింది.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

ఒక్కసారిగా తెప్పరిల్లినట్లు అందరూ ఊపిరి పీల్చి వదిలారో లేదో –

తులసి వణికిపోతూ ముందుకు వచ్చింది. ఏడుపును గుటకలు మింగుతూ భయం భయంగా అంది –

''సార్... ఇలా జరుగుతుందని అనుకోలేదు. ఆరోజు.. ఆరోజు... షబ్బీర్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. నేను విన్నాను. ఆ తరువాత ఎవరో ఫోన్ చేసి అడిగారు. నేను అదే చెప్పాను. అంతే, మేడం... నేను కావాలని చెప్పలేదు.''

''ఏమని చెప్పావ్?'' సుమతి, ఉదయ్ ఒకేసారి అడిగారు.

''ఏం చేసుకుంటావో చేసుకో– ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో – ఆపగలిగితే ఆపు – తిరుపతి పోతున్నా. గాయత్రితో పెళ్ళి. మీ నాన్నా గీన్నా ఎవరొచ్చినా ఆపలేరు'' అంతే సార్... మేడం..''

తులసి నేల మీద కూలబడి ఏడవసాగింది – గొల్లుమంటూ.

''అంతే సార్... అంతే మేడమ్. అతను చెప్పిందే నేనూ చెప్పా సార్..''

సుమతికి ఉదయ్‌కి మెల్లగా విషయం అర్థమవ్వసాగింది. షబ్బీర్ మెతకవాడు. వాళ్ళ మామ గట్టిపిండం. ఇద్దరి మధ్య పొసిగినట్లు కనబడడం లేదు. హు! ఎందరో మగవాళ్ళలాగే సైరా ముందు గాయత్రి అనే బూచిని ఆవిష్కరించేవాడు! మగాను భావుడు! ఆ తరువాత షరా మామూలే! ఒక మనిషిలోని న్యూనత, మనో వైకల్యం ఎంత పని చేసిందీ!

ఇంతలో ఫోన్ – షబ్బీర్ ఇంటికి చేరాడని. అప్పటిదాకా బిగిసినట్లున్న వాళ్ళంతా తెప్పరిల్లారు.

గదిలోని వారంతా నిశ్శబ్దంగా ఎవరికి వారే వచ్చిన దారిన మళ్ళారు.

అందరి మనసుల్లో గాయత్రి సూటిగా నాటిన ప్రశ్న గిరికీలు కొడుతోంది.

''ఇవ్వాళ నాకు జరిగింది. రేపు – మీకు జరగదా?''

***

గాయత్రి వెళ్ళిపోయింది. అవమానాన్ని మూట గట్టుకొని.

కొన్నాళ్ళకి, తులసికి ముఖం చెల్లక తనే ఉద్యోగం మానేసి వెళ్ళిపోయింది.

షబ్బీర్ సైరాతో సహా మామ గారింట కాపురం చేస్తున్నాడనీ – మామ ఎరికలోని మరో రొయ్యాలాసుపత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా చేరాడనీ – సైరా ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిందనీ – బియిడి పరీక్ష రాయబోతోందని – కర్ణాకర్ణి తెలిశాయి.

షబ్బీర్ ఏమాత్రం సంతోషంగా ఉన్నాడో అతనికే తెలియాలి.

అతను అంతటి అబద్ధం ఎందుకు ఆడాడో – దానివలన ఏం బావుకున్నాడో అది ఎవరికీ అంతు బట్టలేదు. అదీ అతనికే తెలియాలి.

అలాగే, అటు షబ్బీర్ ఇంటికి చేరడంతో – వీధులకెక్కిన మూడు పార్టీల పెద్దమనుషుల ఆవేశం ఉఫ్‌మంటూ ఉత్తుత్తినే తేలిపోయింది.

రొయ్యల మీసాల రోషంలా!

అయినా, ఆ మీసాలు మెలివేయడంలో ఎంత సంఘీభావన! ఎంత నైతిక బాధ్యత! అబ్బో!

ఛ! తప్పొప్పుల తరాజులు మోస్తూ, ద్వేషాగ్నుల తల్వారులు దూస్తూ.

''నయం. ఎలాంటి అఘాయిత్యం జరగలేదు. అటు సైరా, ఇటు గాయత్రి... ఎంత తల్లడిల్లారో... హు!'' సుమతి అంది, ''అన్నీ సర్దుకున్నాయి...''

''ఏమో ఎవరు చెప్పొచ్చారు? ఏమీ లేని దానికే అంతమంది అత్యుత్సాహంగా ప్రతిస్పందించారు. ఇక, జరిగిన విషయంలో గాయపడ్డ గుండెలు ఎవరికి కావాలి? ఏమైనా, ఇది ఎప్పటికైనా గాయత్రి భర్తకూ తెలియకపోదు. అతను ఎలా అర్థం చేసుకుంటాడో! అతనూ ఈ సమాజంలో ఒక భాగమేగా!'' ఉదయ్ నర్మగర్భితంగా అన్నాడు.

గాయత్రి పెళ్ళి. శుభలేఖ అయినా పంపలేదు.

సుమతి, ఉదయ్ నిట్టూర్చారు.

గాయత్రి పెళ్ళికి శుభాకాంక్షలు పంపుతూ, మనసారా!

★